క్లుప్తంగా

ఎరువులందించి రైతులను ఆదుకోండి



వినతిపత్రం ఇస్తున్న రైతు, ప్రజా సంఘాల నాయకులు

మడకశిర: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కాటమయ్య, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు హనుమంతు, రీడ్స్ సంస్థ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, స్థానిక రైతు సంఘం నాయకుడు నటరాజ్ విమర్శించారు. వారు సోమవారం రైతులకు పూర్తిస్థాయిలో యూరియా తదితర ఎరువులను పంపిణీ చేసి ఆదుకోవాలని కోరుతూ స్థానిక రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు పడుతున్నారని, అందరికీ యూరియా అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల సమయంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చిన నాయకులు అధికారంలోకి రాగానే మరచి పోయారని మండిపడ్డారు.

సమాజానికి ఉపయోగపడేలా ప్రాజెక్టులు

హిందూపురం టౌన్: వినూత్నంగా, సమాజానికి ఉపయోగపడేలా ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు ఉండాలని, ఆ దిశగా విద్యార్థులకు సూచనలు ఇవ్వాలని ఉపాధ్యాయులకు పెనుకొండ డీవైఈఓ జాన్ రెడ్డప్ప సూచించారు. పట్టణంలోని చిన్మయ విద్యాలయలో సోమవారం ఇన్‌స్పైర్ అవార్డ్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీవైఈఓ పాల్గొని పలు సూచనలు చేశారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్‌కు ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి, సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి అనే వాటిపై ఉపాధ్యాయులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, మనోజ్ కుమార్, సచింద్ర, చిన్మయ పాఠశాల భీమరాజ్, సరళ, డివిజన్‌లోని గణిత, సైన్సు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కంటే ఎంజేపీకే డిమాండ్ ఎక్కువ



విద్యార్థితో పేఫోన్ ద్వారా మాట్లాడిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: కార్పొరేట్ కంటే ఎంజేపీ స్కూళ్లకే అధిక డిమాండ్ ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళీశాఖామాత్యులు సవిత పేర్కొన్నారు. పట్టణంలోని ఎంజేపి పాఠశాలలో సోమవారం మంత్రి స్మార్ట్ ఫోన్‌పే ఫోన్లను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 110 గురుకులాల్లో 700లకు పైగా ఫోన్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పే ఫోన్లతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని, తల్లిదండ్రులతో మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. గురుకులాల్లో ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గురుకులాల్లో 6 చొప్పున పేఫోన్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి స్మార్ట్ కార్డు అందజేస్తామని, ఆ కార్డులో తల్లిదండ్రులు సూచించిన నాలుగు ఫోన్ నంబర్లను పొందుపరచడం జరుగుతుందన్నారు. ఆ నెంబర్లకే విద్యార్థులు తమకు కేటాయించిన సమయంలో మాట్లాడుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పరిశీలకులు నరసింహరావు, మార్క్‌ఫెడ్‌ఛైర్మన్ బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

హిందూపురం టౌన్: రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహామూర్తి మాట్లాడుతూ పీపీపీ విధానం అమలు చేస్తే వందలాది మంది ప్రతిభ గల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందన్నారు. దీనివల్ల కేవలం నష్టపోయేది విద్యార్థులు మాత్రమే కాదని, అనేక మంది పేద వర్గాల ప్రజలు కూడా ఉచిత వైద్యానికి దూరమవుతారన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, అరవింద్, కిరణ్, యశ్వంత్, గణేష్, అజయ్, హర్ష, అరవింద్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో పత్తి రైతులు

- రైతులను ముంచిన అధిక వర్షాలు
- పత్తి విత్తనాల దిగుబడి తగ్గే ప్రమాదం
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- ప్రభుత్వమే ఆదుకోవాలంటున్న అన్నదాతలు

విత్తన పత్తి రైతులు కష్టాలతో సతమతమవుతున్నారు. అధిక వర్షాలు విత్తన పత్తి రైతులను నట్టేట ముంచాయి. పెట్టిన పెటుబడి కూడా గిట్టుబాటు కాని పరిస్థితి ఏర్పడిందని అన్నదాతలు వాపోతున్నారు.



ఎండకు ఆరబెట్టిన విత్తన పత్తి

మడకశిర: ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో ఎక్కడా లేని విధంగా మడకశిర నియోజకవర్గంలోని రైతులు విత్తన పత్తి సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌లో నియోజకవర్గంలో దాదాపు 2,600 ఎకరాల్లో రైతులు విత్తన పత్తి సాగు చేశారు. అత్యధికంగా అమరాపురం మండలంలోనే దాదాపు 1,500 ఎకరాల్లో విత్తన పత్తి సాగు చేశారు. అలాగే గుడిబండ, రొళ్ల, అగళి మండలాల్లో 1,100 ఎకరాల్లో విత్తన పత్తి సాగైనట్లు చెబుతున్నారు.

విత్తన కంపెనీల ప్రోత్సాహంతో ..

నియోజకవర్గంలో విత్తన కంపెనీల సహాయ సహకారం, ప్రోత్సాహంతో రైతులు విత్తన పత్తిని సాగు చేశారు. విత్తన పత్తి సాగుకు అవసరమైన పెట్టుబడిని కూడా విత్తన కంపెనీలే అందిస్తాయి. విత్తనాల నుంచి మందులు, కూలీలకయ్యే ఖర్చులకు విత్తన కంపెనీలు ముందుగానే రైతులకు డబ్బులు చెల్లిస్తాయి. ఎకరాకు విత్తన పత్తి సాగుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చులు వస్తాయి. రైతులు పండించిన విత్తనాలను కూడా విత్తన కంపెనీలే కొనుగోలు చేస్తాయి. కంపెనీలు విత్తనాలను కొనుగోలు చేసిన తర్వాత రైతులకు ముందుగా ఇచ్చిన డబ్బులను జమ చేసుకుని మిగిలిన డబ్బులను చెల్లిస్తాయి.

తగ్గిన దిగుబడి

విత్తన పత్తి సాగులో రైతులకు ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తేనే గిట్టుబాటు అవుతుంది. లేకపోతే ఏమాత్రం గిట్టుబాటు కాదు. విత్తన కంపెనీలు క్వింటాల్ పత్తి విత్తనాలను రూ.45 వేలు చొప్పున ధర నిర్ణయించాయి. ఈమేరకు ఎకరాకు రూ.3.15 లక్షల నుంచి రూ.3.60 లక్షల వరకూ రైతులకు అదాయం లభిస్తుంది. ఇందులో రూ.1.50 లక్షల ఖర్చులు పోను రైతులకు అంతో ఇంతో మిగులుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితిలో ఎకరాకు 4 నుండి 5 క్వింటాళ్ల కన్నా ఎక్కువగా దిగుబడి రాని పరిస్థితి ఉంది. ఈనేపథ్యంలో ఈఏడాది విత్తన పత్తి రైతుల ఆశలు అడియాశలయ్యాయి.

అధిక వర్షాలతో నష్టం

ఈ ఏడాది అధిక వర్షాలు విత్తన పత్తి రైతుల కొంప ముంచాయి. పంట పెట్టినప్పటి నుంచి వర్షాలు వస్తూనే ఉన్నాయి. ప్రధానంగా విత్తన పత్తి సాగులో ఆడ, మగ పూవ్వులను క్రాస్ చేస్తారు. దాదాపు ఈ ప్రక్రియ 50 రోజుల పాటు నిరంతరం జరుగుతుంది. ఈ ప్రక్రియ సమయంలో వర్షాలు అధికంగా వచ్చాయి. దీంతో కొన్ని రోజుల పాటు రైతులు ఈప్రక్రియను చేయలేక పోయారు. ఇది పత్తి విత్తనాల దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణంగా మారింది. అలాగే అధిక వర్షాలకు పత్తి విత్తనాలు చెట్లల్లోనే మొలకెత్తాయి. విత్తనాల నాణ్యత కూడా తగ్గిపోయింది.

అధిక వర్షాలతో నష్టం



అధిక వర్షాలతో విత్తన పత్తి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. విత్తన పత్తి సాగు రైతులకు అంతో ఇంతో గిట్టుబాటు అయ్యేది. ఈ ఏడాది అధిక వర్షాలతో పత్తి విత్తనాల దిగుబడి తగ్గే ప్రమాదం ఏర్పడింది. ఫలితంగా ఆదాయం తగ్గి ఆర్థిక ఇబ్బందులు కూడా తప్పని పరిస్థితి.

– ప్రశాంత్, కోడిపల్లి, అగళి మండలం

పెట్టుబడి తిరిగి వస్తే చాలు



అమరాపురం మండలంలో అత్యధికంగా విత్తన పత్తి సాగైంది. గత ఏడాది గిట్టుబాటు కావడంతో ఈఏడాది అధికంగా విత్తన పత్తి సాగు చేశాం. అయితే ఈఏడాది విత్తన పత్తి క్రాస్ చేసే ప్రక్రియకు అధిక వర్షాలతో అంతరాయం ఏర్పడింది. దీంతో విత్తనాల దిగుబడి తగ్గనుంది. పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తే చాలని భావిస్తున్నాం.

– ఈశ్వరప్ప, అమరాపురం

ప్రభుత్వం ఆదుకోవాలి



విత్తన పత్తి సాగులో ఈఏడాది ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చే పరిస్థితి లేదు.గత ఏడాది ఎకరాకు రూ.3.50 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ఈఏడాది ఎకరాకు రూ.2లక్షలు కూడా వచ్చే పరిస్థితి లేదు.అధిక వర్షాలు ఆదాయం తగ్గడానికి ప్రధానం కారణం . రాష్ట్ర ప్రభుత్వం విత్తన పత్తి రైతులను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలి.

– బడప్ప, ఆర్‌గొల్లహట్టి, రొళ్ల మండలం

స్మారకాలను సంరక్షించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: చారిత్రాత్మక స్మారకాలను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని కర్ణాటక ఇతిహాస అకాడమి సభ్యుడు, పరిశోధకుడు హోమా నాగరాజు తెలిపారు. వైఎస్ హొసకోటలోని రాష్ట్రీయ విద్యా పీఠ కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పావగడ తాలూకాలోని ప్రతి గ్రామం ఇతిహాస పారంపర్యను పొందిందని, ఇక్కడి కోటలు, వీరగల్లులు తదితర స్మారక అవశేషాలు పెద్ద ఎత్తున కన్పిస్తాయన్నారు. అయితే కొందరు నిధుల దొంగలు వాటిని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. తాలూకా వ్యాప్తంగా ఉండే స్మారకాలు, శిలా శాసనాలు, తదితర వాటిపై పరిశోధనలు చేసి గ్రంథాలను రచించేలా యువ విద్యావంతులు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో కసాప అధ్యక్షుడు కట్టా నరసింహమూర్తి, శ్రీధర్, ఎస్ఆర్ అశ్వర్థ కుమార్, ఐఏ నారాయణప్ప పాల్గొన్నారు.

వృద్ధురాలికి తీవ్ర గాయాలు

రొళ్ల: కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో వృద్ధురాలు కెంచమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రొళ్ల మండల పరిధిలోని జీరిగేపల్లికి చెందిన కెంచమ్మ కుటుంబ సభ్యులతో కలిసి కారులో బంధువుల ఇంటికెళ్లి తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపాన మలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో కెంచమ్మ తీవ్రంగా గాయపడగా తుమకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

‘అన్నదాత పోరు’ విజయవంతం చేయండి



పెనుకొండ: నాయకులకు దిశా నిర్దేశం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



రొళ్ల: అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు తదితరులు

పెనుకొండ రూరల్: యూరియా కొరతను నిరసిస్తూ రైతుకు అండగా మంగళవారం వైఎస్సార్‌సీపీ ‘అన్నదాత పోరు’ కార్యక్రమం నిర్వహిస్తోంది. రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి ఉదయం 9 గంటలకు చేరుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి అన్నదాతకు మద్దతుగా ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహ, సుధాకర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్లు నాగళూరు బాబు, శ్రీకాంత్‌రెడ్డి, కౌన్సిలర్ శేషాద్రి, నాయకులు గణప్ప, శ్రీరాములు, యాసిన్, నాయుడు, ఇస్మాయిల్, రాము, కొండల రాయుడు, సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ శివయ్య, ప్రభాకర్ రెడ్డి, చెన్నకేశవులు, మల్లిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, నారాయణ యాదవ్, నారాయణ స్వామి, గోపాల్ రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: రాష్ట్రంలో రైతులకు ఏమాత్రం అన్యాయం జరిగిన కూడా ఊరుకొనేదిలేదని.. అన్నదాతలను కాపాడుకోవడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో దివగంత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజుతో పాటు వైఎస్సార్‌సీపీ పార్టీ శ్రేణులతో కలిసి ఈరలక్కప్ప అన్నదాత పోరు పోస్టర్లను విడుదల చేశారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప, అనంతరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు అన్నీ కష్టలే పడుతున్నారన్నారు. దేశానికి వెన్నముక లాంటి రైతాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. యూరియా కోసం బహిరంగ మార్కెట్‌లో వారు చెప్పిన రేట్లకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వంలో ఎరువుల కొరత ఒకటే కాకుండా పెట్టుబడి సాయం అందలేదని, ఇన్సూరెన్స్‌తో పాటు మద్దతు ధర, ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ ఇలా చెప్పుకొంటూ పోతే ఏవీ లభించే పరిస్థితి లేదన్నారు. యూరియా కోసం రైతాంగం కష్టాలు పడుతుంటే.. కూటమి ప్రభుత్వం రైతులపై బెదిరింపులకు దిగడం బాధాకరమన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమాన్ని నిర్వహించడానికి శ్రీకారం చుట్టామన్నారు. రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రంగనపల్లినాగేంద్ర, ప్రసన్నకుమార్, నాగేష్‌రంగారెడ్డి, భోజేగౌడ, శ్రీనివాస్, సదాశివప్ప, ప్రకాష్, గోవిందప్ప, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత పోరు పోస్టర్లు విడుదల

చిలమత్తూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలు అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేశారు. మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు ఇవ్వకుండా, రైతులు అందాల్సిన ఎరువులను టీడీపీ నేతలు బ్లాక్ మార్కెట్‌కు తరలించారన్నారు. రైతులకు వెంటనే ఎరువులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ మద్దిపి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ ఆదినారాయణ, చిన్నప్పయ్య, దివాకర్‌రెడ్డి, అయూబ్, శంకర్‌రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నయిముల్లా తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: లేపాక్షిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో అన్నదాత పోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం విడుదల చేశారు. మంగళవారం ఉదయం హిందూపురం నుంచి పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం వరకూ జరిగే ర్యాలీకి రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరును ఎండగడదాం

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక



చిలమత్తూరు: రైతులకు చేరాల్సిన ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్న కూటమి నేతల తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పెనుకొండ ఆర్డీఓ కార్యాలయం వద్ద నేడు చేపట్టబోయే అన్నదాత పోరు కార్యక్రమానికి నియోజకవర్గంలోని రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపిక పిలుపు నిచ్చారు. రైతులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టడానికి ప్రతి రైతు ముందుకు రావాలన్నారు. ఇప్పుడు యూరియా, రేపు మరొకటి రైతులకు చంద్రబాబు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. హిందూపురం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్దకు ఉదయం 7:30 గంటలకు హిందూపురం పట్టణం, రూరల్ మండల రైతులు, పార్టీ శ్రేణులు చేరుకోవాలని, లేపాక్షి, చిలమత్తూరు మండల రైతాంగం తప్పక నిరసనలో పాల్గొనాలని సూచించారు.



చిలమత్తూరులో అన్నదాత పోరు పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



లేపాక్షిలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

భూసేకరణ చట్టంపై బుక్‌లెట్ విడుదల



రొద్దంలో బుక్ లెట్ విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

రొద్దం: మండల కేంద్రంలోని బస్‌స్టాండ్ ఆవరణలోని పీర్ల చావిడిలో సోమవారం 2013 భూసేకరణ చట్టం బుక్ లెట్‌ను రైతు సంఘం ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పేర్లతో ఏడాదికి రెండు పంటలు పండే భూమిని సన్న, చిన్నకారు రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకుంటున్నారని చెప్పారు. అలాంటప్పుడు 2013 చట్టం ఉపయోగ పడుతుందన్నారు. 2012లో భూ సేకరణ నష్టపరిహారం, పునరావాస పునరుపాధి కల్పన చట్టం పార్లమెంట్‌లో ఆమోదించారన్నారు. 2018లో భూ సేకరణ చట్టంలో 2, 3 అధ్యాయాలను సవరణ చేసి రైతాంగానికి తీవ్రమైన ద్రోహం చేశాయన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫకృద్దిన్, హమీలీ సంఘం సభ్యులు గోపాలప్ప, రుద్రప్ప, వెంకటరాముడు, లక్ష్మీనరసప్ప, స్థానిక రైతులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి





మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి(ఇన్‌సెట్‌లో) రవికుమార్(ఫైల్)

హిందూపురం టౌన్/చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని నానెప్పనగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ కే.రవికుమార్ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన పట్టణంలోని సీఅండ్ ఐజీ మిషన్ చర్చి ప్రెసిడెంట్‌గా గతంలో పనిచేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి డీబీకాలనీలోని మృతుడి నివాసానికి చేరుకొని రవికుమార్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. వేణురెడ్డి మాట్లాడుతూ రవికుమార్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. నివాళులర్పించిన వారిలో కౌన్సిలర్ నాగరాజు, యువజన విభాగం నేత మింటు, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, లైఫ్ వరల్డ్ ఉదయ్‌కుమార్, శ్రీరాములు, శేషాద్రిగౌడ్, హరి తదితరులున్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

హిందూపురం టౌన్: పట్టణంలోని పేట వెంకటరమణస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్‌గా నవీన్ చంద్ర, సభ్యులుగా మాల, రాము, శ్రీనివాసులు, రామిరెడ్డి, వెంకటరత్నమ్మ, శ్రావణ సంధ్య, వెంకటచలపతి, సరోజ, అర్చకులు రామాయనం చరణ్‌ల చేత దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు.

చోరీకి విఫలయత్నం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నల్లగొండ్రాయనపల్లి సమీపంలో ఉన్న మరిగమ్మ ఆలయంలో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఆదివారం అర్ధరాత్రి మెయిన్ గేట్ తాళాలు పగలు గొట్టి లోపలికి ప్రవేశించారు. అయితే వెండి ఆభరణాలు, హుండీ ఉండగా ఆలయం లోపలి తలుపులు తెరుచుకోకపోవడంతో వారు వెనుదిగారు. ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్ బాబు ఆలయాన్ని సందర్శించారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామంలో సర్వేనంబర్ 173-5లో వ్యవసాయాధికారులు మొక్కజొన్న పంటలో చేస్తున్న ఈ క్రాప్ నమోదును ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో వేసిన ప్రతి పంటను ఈ క్రాప్ నమోదు చేయాలని, ఈ క్రాప్ నమోదులో ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకూడదని అధికారులకు సూచించారు. అలాగే కల్లూరులోని ఆర్‌ఎస్‌కే జరుగుతున్న యూరియా పంపిణీని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఏఓ శ్రీలత తదితరులున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

లేపాక్షి: రాష్ట్రంలోని వ్యవసాయ రైతులకు సంబంధించి వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లును బిగిస్తే వాటిని తొలగించి ధ్వంసం చేస్తామని సీపీఐ నాయకులు తెలిపారు. స్మార్ట్ మీటర్లను ఎక్కడ ఏర్పాటు చేయకూడదని సోమవారం తహసీల్దార్ సౌజన్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి గౌతమ్‌కుమార్ , నాయకులు దాదాసీర్, నారాయణరెడ్డి, శివప్ప, వెంకటేశప్ప, జగదీష్, గోవిందప్ప, సాయి కిరణ్, బాబాజాన్, నరసింహారెడ్డి, లక్ష్మయ్య, సిద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ యూరియా అందించాలి



హిందూపురంలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

హిందూపురం టౌన్: రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హిందూపురం సీపీఐ కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. జిల్లాలోని ప్రతి రైతుకు ప్రత్యామ్నాయ పంటలకు నాణ్యమైన విత్తనాలు ఉచితంగా అందించి జిల్లాకు తగినంత యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, సీపీఐ సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, మారుతీరెడ్డి, కార్యవర్గ సభ్యులు బాబు, చౌళూరు రవికుమార్, సమీవుల్లా, చాంద్ బాషా, నాగేంద్ర, జిలాన్ పాల్గొన్నారు.

గోరంట్ల: రైతులు యూరియ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని సీపీఐ నాయకులు తహసీల్దార్‌కు సోమవారం విజ్ఞప్తి చేశారు. గోరంట్ల మండలంలో రైతులు యూరియా లభించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ మారుతీకి విన్నవించారు. సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: రైతులకు తగిన యూరియా అందించాలని సీపీఐ నాయకులు డిప్యూటీ తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజ్ గోపాల్, నాయకులు చాంద్‌బాషా, అంజినమ్మ, గంగరాజు, నారాయణ స్వామి, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నాగార్జుడు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. సోమవారం పాఠశాల సిబ్బంది అవార్డు గ్రహిత దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీ రామకృష్ణ, కృష్ణవేణి, ప్రభాకర్ పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నారాయణప్ప ఇటీవల జేసీ అభిషేక్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు హెచ్ఎం .నారాయణప్పను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.